సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 2 । నవంబర్ । 2024



సచివాలయ ఉద్యోగిపై దాడి

గుర్రంకొండ మండలం శెట్టివారిపల్లె పంచాయతీ బోడిగుట్ట గ్రామ ఉద్యోగిపై దాడి చేసి పింఛన్ సొమ్ము దోచుకెళ్లిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. -8లో



భారీ స్కోరు దిశగా 'అనంత' జట్టు

కడప నగరంలో నిర్వహిస్తున్న అండర్-14 క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శుక్రవారం అనంతపురం, విజయనగరం జట్లు తలపడ్డాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.290	రూ.340
రెండోరకం	రూ.200	రూ.268

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 104 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

రేపు షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక

రామాపురం: స్థానిక బీసీ కాలనీలోని గురుకుల పాఠశాల బాలుర మైదానంలో ఆదివారం షూటింగ్ బాల్ సీనియర్ బాలుర జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు ఉమ్మడి జిల్లా వైఎస్సార్ కడప షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ వెంట ఆధార్‌కార్డును తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్: 93918 35714ను సంప్రదించాలని వివరించారు.

పింఛా నుంచి నీటి విడుదల

సుండుపల్లె: మండల పరిధిలోని పింఛా ప్రాజెక్టు కుడి కాలువకు గేటు అమర్చే క్రమంలో భాగంగా.. ఏటి దిగువకు 300 క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని ప్రాజెక్టు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు నీటి విడుదలను శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు దిగువ ప్రాంతాలైన ముడుంపాడు, నగిరి, కురవపల్లె, పెద్ద బిడికి, రాయవరం రెడ్డివారిపల్లితోపాటు పలు గ్రామాల ప్రజలు ఈత కొట్టేందుకు గానీ, మోటారు ఉన్న వారు కానీ, ఆవులు, గేదెలు, గొర్రెలు మేపేవారు జాగ్రత్తగా ఉండాలని ప్రాజెక్టు ఏఈ నాగేంద్ర నాయక్ తెలిపారు.

జాబ్‌మేళా విజయవంతం

రాయచోటి (జగదాంబసెంటర్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీడ్ ఆప్, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైంది. ముత్తూట్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, యంగ్ ఇండియా, టీవీఎస్ ఇండెన్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొన్నాయి. ఇంటర్వ్యూకు 98 మంది హాజరు కాగా ఉద్యోగాలకు 26 మంది ఎంపికయ్యారు. వారిని ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.శివశంకర్, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నాగార్జున, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దోనప్ప, స్కిల్ డెవలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేష్, ఏపీ ఎస్‌డీసీ ఆఫీసర్ శ్రీనివాస్, సీడాప్ స్టాఫ్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌశల్ పోస్టర్లు విడుదల



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈవో, అధికారులు

రాయచోటి టౌన్: జాతీయ విజ్ఞాన మండలి, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న కౌశల్ 2024 క్విజ్ పోస్టర్లను శుక్రవారం డీఈవో సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌశల్ రాష్ట్ర అకడమిక్ టీం సభ్యుడు అంజనేయులు, ఏపీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు నరసింహులు, జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ ఓబుల్‌రెడ్డి, కౌశల్ జిల్లా జాయింట్ కో ఆర్డినేటర్ కవిత, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, వెంకటేశ్వర్లు, బలరాం పాల్గొన్నారు.

అపార్‌తో అనేక ప్రయోజనాలు

రాజంపేట టౌన్: ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)తో అనేక ప్రయోజనాలు ఉన్నాయని డీవైఈఓ శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంఈఓ కార్యాలయ సభాభవనంలో శుక్రవారం హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక దేశం, ఒక స్టూడెంట్ కార్డు పేరుతో కేంద్రం అపార్‌ను తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో రాజంపేట, పుల్లంపేట ఎంఈఓలు కె.రఘునాథ్‌రాజు, సుబ్బరాయుడు, జి.చక్రధర్‌రాజు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

రాయచోటి టౌన్: రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా దీపావళి కానుకగా దీపం-2 పథకం ద్వారా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ అమలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఆర్‌డీవో శ్రీనివాస్, ఐటీసీ సేల్స్ అధికారి జి.ప్రవీణ్‌కుమార్, డీఎస్‌వో రఘురాం, టీడీపీ నాయకులు మండిపల్లె లక్ష్మీప్రసాద్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా ప్రారంభించారు.

నేడు రహదారుల మరమ్మతుల కార్యక్రమం

జిల్లాలో ఆరు నియోజకవర్గాలలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతుల కోసం మిషన్ పాత్ హోల్ ఫ్రీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 2న ప్రారంభించనుందన్నారు.

- జిల్లా అభివృద్ధిపై ఈ నెల 3న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

దీపావళి.. ఆనందాలకేళి



చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా దీపావళి జరుపుకొంటారు. దీపావళి అంటే దీపాల పండుగ. చీకటిని పారదోలి వెలుగు నింపే వేడుక. పిల్లలు, పెద్దలు అందరూ కలిసి ఈ పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా జరుపుకొన్నారు. టపాసులు కాల్చి ఆనంద భరితులయ్యారు. చిన్నారులు, యువకులు నాలుగైదు రోజుల ముందు నుంచే నిర్వహించిన వేడుకలు శుక్రవారం ముగిశాయి. - సిద్దవటం

కార్తీకం.. ప్రారంభం



హరిహరులకు ఎంతో ప్రీతికరమైన మాసం కార్తీకం. ఏటా దీపావళి మరుసటి రోజు నుంచే కార్తీక మాసం ప్రారంభమవుతుంది. అయితే ఈ ఏడాది అమావాస్య గురువారం సాయంత్రం ప్రారంభమై శుక్రవారం సాయంత్రం వరకు ఉండటంతో.. శనివారం నుంచి ఆరంభం కానుంది. నెల రోజుల పాటు ప్రజలు నియమ నిష్టలు, అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించనున్నారు. - రాజంపేట టౌన్

డేంజర్ బ్రిడ్జి!



నందలూరు-రాజంపేట మధ్య చెయ్యేరు నదిపై నిర్మించిన బ్రిడ్జి



వంతెనపై పడిన గుంత

- వంతెనపై అస్తవ్యస్తంగా రోడ్డు
- లైటింగ్ సౌకర్యం లేక ఇక్కట్లు
- పట్టించుకోని నేషనల్ హైవే అథారిటీ

రాజంపేట: కడప -రేణిగుంట జాతీయ రహదారిలో నందలూరు చెయ్యేరు నదిపై నిర్మించిన బ్రిడ్జి డేంజర్‌గా మారింది. కిలోమీటరు పొడవున ఉన్న ఈ వంతెన దాటేంత వరకు.. వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఎన్‌హెచ్‌లో ఉండగా, ఇటీవల ఎన్‌హెచ్ఏఐకు బదలాయింపు జరిగింది. నేషనల్ హైవే ఆఫ్ అథారిటీ ఇండియా(తిరుపతి సర్కిల్) అధికారగణం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

'తారు'తమ్యాలు

చెయ్యేరు వంతెన మధ్యలో ఉన్న బీటీ(తారు)రోడ్డు అస్తవ్యస్తంగా తయారైంది. రోడ్డు మధ్యలో గుంతలు పడ్డాయి. అది కాకుండా తారు హెచ్చుతగ్గులుగా ఉండటంతో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదానికి గురవుతున్నారు. కొన్ని చోట్ల రోడ్డు గతకులుగా ఉంది. తారు కరిగి ఎటు అంటే అటు నిలిచిపోయింది. కొన్ని చోట్ల తారురోడ్డు లెవల్‌గా లేదని వాహనదారులు విమర్శిస్తున్నారు.

సూచిక బోర్డులు ఏవీ?

చెయ్యేరు బ్రిడ్జిలో ప్రమాద నివారణ చర్యలు కనిపించడం లేదు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు వంతెన నిర్వహణపై తగిన రీతిలో స్పందించడం లేదనే విమర్శలను మూటగట్టుకుంది. బ్రిడ్జిపై వేగాన్ని నిరోధించే విధంగా సూచిక బోర్డులు కానీ, స్పీడ్‌బ్రేకర్లు కూడా ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళలో లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలి.

తరచూ ప్రమాదాలు

బ్రిడ్జిలో వాహదారులు వేగంతో వెళ్లడం, అలాగే వాహనాలను ఓవర్‌టేక్ చేయడం లాంటి పరిణామాలతో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. అక్టోబర్ మొదటి వారంలో కారు ఢీకొనడంతో ఎంజీపురానికి చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఇలా ప్రతి నెలలో 2 నుంచి 4 ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఒకరిద్దరో మృతి చెందుతుండగా.. పదుల సంఖ్యలో గాయపడుతున్నారు. రాత్రి వేళలో బ్రిడ్జిపై చీకటిగా ఉండటంతో కూడా కొన్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ బ్రిడ్జి సగం రాజంపేట, మరో సగం నందలూరు పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తుంది.



వాహనదారుల్లో భయాందోళన



చెయ్యేరు వంతెనలో రాకపోకలు సాగించాలంటే భయం. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని దాటాల్సి వస్తోంది. అక్కడక్కడా తారురోడ్డు సమాంతరంగా లేదు. ఫలితంగా వాహనదారులు అదుపుతప్పి ప్రమాదానికి గురవుతున్నారు. ఎన్‌హెచ్ అధికారులు ప్రమాద నివారణ చర్యలు చేపట్టడం లేదు. లైటింగ్ లేకపోవడంతో రాత్రి వేళలో రాకపోకలు సాగించడానికి ఇబ్బందికరంగా ఉంది. -గాదె వెంకటరమణ యాదవ్, రిటైర్డ్ టీచర్, నందలూరు

ఇరుకుగా రోడ్డు



హైవేలోని బ్రిడ్జి నిత్యం ప్రమాదాలతో ప్రాణాలు బలిగొంటోంది. అక్కడ ప్రమాద నివారణ చర్యలు కనిపించడం లేదు. ఫుట్‌పాత్ మధ్యలో ఉన్న రోడ్డు నేటి పరిస్థితుల్లో వాహనాల రాకపోకలకు ఇరుకుగా మారింది. బ్రిడ్జిలో వేగాన్ని నిరోధించడం, తారురోడ్డు సక్రమంగా ఉండటం, నివారణ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. బ్రిడ్జి చివరి గుంత పడింది. ఎన్‌హెచ్ఏఐ అధికారులు పట్టించుకోవడం లేదు. -షేక్‌అలీబాషా, కూరగాయల వ్యాపారి, నందలూరు

పండుగల వేళ ఆర్టీసీకి భారీ ఆదాయం



మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రాము

రాయచోటి: దసరా, దీపావళి సందర్భంగా ఆర్టీసీకి భారీ ఆదాయం వచ్చిందని, మొత్తం రూ. 44,28,666 సమకూరిందని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాము తెలిపారు. సెలవు రోజుల్లో జిల్లా పరిధిలోని ఐదు డిపోల నుంచి వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపామని ఆయన పేర్కొన్నారు. దీపావళి సందర్భంగా అక్టోబర్ 30, 31వ తేదీలలో 23 సర్వీసుల ద్వారా రూ.3,70,129 వచ్చిందన్నారు. దసరా సందర్భంగా 217 స్పెషల్ బస్సుల ద్వారా 30284 మంది ప్రయాణికులను చేరవేశామన్నారు. ఇందుకు గాను రూ. 40,58,537 ఆదాయం వచ్చిందని వివరించారు.

కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక బస్సులు

కార్తీకమాసం సందర్భంగా ఆలయాలు, పర్యాటక కేంద్రాల సందర్శనకు ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతుందని ఆర్ఎం రాము తెలిపారు. తలకోన-శ్రీకాళహస్తి, శ్రీశైలం, మహానంది బస్సు సర్వీసులు ప్రారంభించామన్నారు. పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షణకు అరుణాచలానికి బస్సులు ఉన్నాయన్నారు. ఆర్టీసీ అద్దె బస్సులు కావాల్సిన వారి కోసం కొన్ని నిబంధనలు సరళతరం చేశామని చెప్పారు. గతంలో 480 కిలోమీటర్ల రవాణా ఉండగా, ప్రస్తుతం 420 కిలోమీటర్లకు కుదించామన్నారు. ముఖ్యంగా శబరిమలై వెళ్లే ప్రయాణికులకు మంచి అవకాశంగా ఉంటుందన్నారు. అయ్యప్ప స్వాములు ప్రయాణించే బస్సులో గురుస్వామి, వంట మాస్టర్‌కు ఉచిత ప్రయాణ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని మదనపల్లి, రాయచోటి డిపోల నుంచి ఈ ఏర్పాట్లు చేశామని వివరించారు.

ముగిసిన మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన



ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పులివెందుల రూరల్: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటన విజయవంతంగా ముగిసింది. మంగళవారం బెంగళూరు నుంచి ఇడుపులపాయకు చేరుకుని దివంగత సీఎం వైఎస్సార్ సమాధి వద్ద నివాళులర్పించి అక్కడి నుంచి నేరుగా పులివెందులలోని భాకరాపురంలో ఉన్న తన క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనను కలిసి పలు సమస్యలను విన్నవించారు. రెండవ రోజు ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు జగన్ క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతోపాటు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పాల్గొన్నారు. రెండు రోజుల పర్యటన ముగించుకుని మూడవ రోజు గురువారం తిరిగి ఆయన బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

వైఎస్ జగన్‌ను కలిసిన ఆర్‌సీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

పులివెందుల టౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం ఉదయం రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా రెడ్డి సామాజిక వర్గంలో అనేక మంది పేదలు ఉన్నారని, వారి ఇబ్బందుల గురించి, రెడ్డి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వైఎస్ జగన్‌కు ఆయన వివరించారు.

ఐదు రాష్ట్రాలకు బి.కొత్తకోట టమాట

బి.కొత్తకోట: బి.కొత్తకోట వ్యవసాయ మార్కెట్ యార్డుకు వస్తున్న టమాట ఐదు రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. రెండు నెలల క్రితం మార్కెట్‌లో టమాట క్రయ విక్రయాలు మొదలయ్యాయి. పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాలు, సరిహద్దులోని కర్ణాటక ప్రాంతం నుంచి టమాట విక్రయానికి వస్తోంది. ఈ టమాటను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు రోజూ తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఒడిస్సా, గుజరాత్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తంబళ్లపల్లె మార్కెట్ కమిటీ నుంచి బి.కొత్తకోటను వేరు చేయించారు. మదనపల్లె కమిటీ పరిధిలోని కురబలకోటను కలిపి బి.కొత్తకోట మార్కెట్ కమిటీని ఏర్పాటు చేయించారు. దీనితో ప్రస్తుతం రైతులకు ఎంతో ఉపయోగపడుతోంది.

4 నుంచి సెమిస్టర్ల పరీక్షలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయ పరిధి లోని బీఈడీ కళాశాలల 2, 4 సెమిస్టర్ల విద్యార్థులకు ఈనెల 4వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలోని 16 కేంద్రాలను సిద్ధం చేశామని, 16,900 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. పరీక్షా కేంద్రాల పర్యవేక్షణకు అబ్జర్వర్లతో పాటు హైపవర్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు.

చిరుత దాడిలో దూడ మృతి

రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారుల హెచ్చరిక



మృతి చెందిన దూడను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

నిమ్మనపల్లె: చిరుత దాడిలో దూడ మృతి చెందిన సంఘటన నిమ్మనపల్లె మండలంలో గురువారం చోటుచేసుకుంది. ముష్టూరు పంచాయతీ చల్లావారి పల్లెకు చెందిన రైతు ఆకుల ఆదెన్న బోడికొండకు సమీపంలోని వ్యవసాయ పొలం వద్ద పశువుల షెడ్ నిర్మించుకొని, పశువులను అక్కడే ఉంచి మేత వేసేవాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం పశువుల వద్ద పాలు పితికి, ఇంటికి తీసుకువచ్చి పాల డిపోకు పోసి, అనంతరం వ్యవసాయ పొలం వద్దకు తిరిగి వెళ్లాడు. అక్కడ షెడ్డులో కట్టి ఉంచిన దూడ కనిపించకపోవడంతో, చుట్టు ప్రక్కల వెతకగా రక్తపు మరకల జాడలు కనిపించాయి. ఏదో అడవి జంతువు దాడి చేసిందని గ్రహించి రక్తపు మరకల జాడను అనుసరిస్తూ వెళ్లగా సమీపంలోని బోడికొండ వద్ద రాళ్ల మధ్యలో మృతి చెంది పడి ఉన్న దూడను కనుగొన్నాడు.అప్పటికే దూడ వెనుక భాగంలో కొంత మాంసాన్ని అడవి జంతువు పీక్కు తిని ఉండటాన్ని గమనించి చిరుత పులి దాడి చేసి ఉంటుందని భావించాడు. సమాచారం అందుకున్న వీఆర్వో నాగేశ్వరరావు, తవ్వళం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ దీప సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు తెలిపారు. దీంతో అటవీ శాఖ మదనపల్లె డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మదన్ మోహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, దూడ మృతి చెందిన విధానాన్ని, చిరుత పులి ఆనవాళ్లను గుర్తించారు. చిరుత పులి దాడితోనే దూడ మృతి చెందిందని నిర్ధారించారు. వైద్యాధికారి డాక్టర్ సురేష్ కు సమాచారం అందించి సంఘటనా స్థలంలోనే పోస్ట్ మార్టం నిర్వహించారు. అనంతరం మదన్‌మోహన్ మాట్లాడుతూ బోడికొండ పరిసర ప్రాంతాలలోని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయ పొలాల వద్ద రాత్రి వేళల్లో పశువులను, గొర్రెలు, మేకలను ఉంచరాదని సూచించారు. బోడికొండ పరిసర ప్రాంతాల్లో పులి సంచారం పై దండోరాను వేయిస్తామన్నారు. వన్య ప్రాణుల వల్ల రైతులకు నష్టం వాటిల్లితే ప్రభుత్వం తగిన నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు.

పింఛన్ కోసం టెన్షన్



పెద్దతిప్పసముద్రంలో సర్వర్ పని చేయక పింఛన్‌దారుల నిరీక్షణ



నందలూరు మండలం నాగిరెడ్డిపల్లి పంచాయతీ వద్ద..



సంబేపల్లెలో పింఛన్‌ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

గత ప్రభుత్వంలో ప్రతి నెల 1వ తారీఖున ఠంచన్‌గా అందే పింఛన్ కోసం.. ప్రస్తుతం టెన్షన్ పడాల్సి వస్తోంది. ఈ నెల 1వ తేదీన సర్వర్ పనిచేయక పోవడంతో వృద్ధులు, వికలాంగులు తీవ్ర అవస్థలు పడ్డారు. అన్నమయ్య జిల్లాలోని పెద్దతిప్పసముద్రం, సంబేపల్లె, నందలూరు, వీరబల్లి, పెద్దమండ్యం తదితర మండలాల వ్యాప్తంగా ఈ పరిస్థితి నెలకొంది. శుక్రవారం ఉదయం నుంచి సర్వర్ పనిచేయక పోవడంతో, మధ్యాహ్నం వరకు వేచి ఉండాల్సి వచ్చింది. అయితే చాలా మంది అవ్వాతాతలు పింఛన్ల కోసం సచివాలయాల వద్దకు వచ్చి పడిగాపులు కాచారు. ఏమని అడిగితే 'మా దగ్గరికి పింఛన్ ఇచ్చేవాళ్లెవరూ రాలేదు.. అందుకే ఇక్కడికి వచ్చాం' అని బదులిచ్చారు. కొన్ని చోట్ల సాయంత్రం వరకు పంపిణీ చేశారు. దీంతో వృద్ధులు, వికలాంగులు, పొలం పనులకు వెళ్లే లబ్ధిదారులు ఎదురుచూడాల్సి వచ్చింది. పనులకు వెళ్లకుండా ఇళ్ల వద్దనే ఉండి పింఛన్ తీసుకోవాల్సి వచ్చిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో తెల్లవారుజామునే ఇంటి దగ్గరకు వచ్చి పింఛన్ ఇచ్చే వారని వారు తెలిపారు. వలంటీర్‌లు ఉన్నప్పుడు ఏ సమాచారమైనా క్షణాల్లో వచ్చేదని, ఇప్పుడా పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. - సాక్షి, నెట్‌వర్క్

క్లుప్తంగా

కోసువారిపల్లెలో మద్యం దుకాణంపై దాడి

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో బ్రాందిషాపుపై దాడి చేసి ధ్వంసం చేసిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. మద్యం దుకాణం నిర్వాహకుల కథనం మేరకు..కురబలకోట మండలం అంగళ్లకు చెందిన అంజనేయులకు లాటరీలో మద్యం షాపు లభించింది. ఊరి చివరి ముదివేడు రోడ్డుకు గతంలో ఏర్పాటు చేసిన మద్యం షాపు రేకుల షెడ్డును లీజుకు తీసుకొని వ్యాపారం నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి మేనేజర్ గోపి 10 గంటలకు షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. ఆ రాత్రి గుర్తు తెలియని దుండగులు షాపు సిమెంటు రేకులను ధ్వంసం చేశారు. శుక్రవారం షాపు తెరిచేందుకు వెళ్లగా జరిగిన సంఘటన గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని షాపును పరిశీలించారు. దుండగులు షాపులోకి వెళ్లలేదు. ఎలాంటి స్టాకు నష్టం జరగలేదని తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

– ఒకరికి పరిస్థితి విషమం, మరొకరికి గాయాలు

గాలివీడు : మండలంలోని పేరాటుగుట్ట వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు...గాలివీడు గ్రామం ఈతోటివారిపల్లెకు చెందిన రామకృష్ణ గాలివీడు నుంచి ఇంటికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా మార్గమధ్యంలో పేరాలగుట్ట వద్దకు రాగానే పెద్దమండ్యం మండలం మట్లివారిపల్లెకు చెందిన సురేంద్ర ద్విచక్రవాహనంలో వస్తు ఢీ కొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. రామకృష్ణ కాలుకు గాయమవ్వగా, సురేంద్ర తలకు బలమైన గాయం కారణంగా చెవి నుంచి తీవ్ర రక్తంస్రావం కావడంతో పరిస్థితి విషమంగా మారింది. వెంటనే క్షతగాత్రులను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వైద్యం అందక ఆవు మృతి

– వైద్యుల నిర్లక్ష్యమే అంటున్న పాడి రైతు


మృతి చెందిన ఆవు

గాలివీడు : వైద్యం అందక ఆవు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. అయితే సకాలంలో స్పందించని వైద్యుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని పాడి రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాల్లోకి వెళితే....గోరాన్ చెరువు గ్రామం కుమ్మరపల్లెకు చెందిన మధుసూదన్‌రెడ్డి అనారోగ్యంతో ఉన్న తన ఆవుకు చికిత్స నిమిత్తం బుధవారం స్థానిక పశు వైద్యశాలకు తీసుకెళ్లాడు. వైద్యుడు సరైన వైద్యం అందించక నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించాడన్నారు. విధిలేని పరిస్థితుల్లో పక్క మండలమైన పెద్దమండ్యం నుంచి వైద్యున్ని పిలిపించిన్నప్పటికీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందని రైతు విచారం వ్యక్తం చేశారు. గాలివీడు పశువుల ఆసుపత్రి వైద్య సిబ్బంది సమయానికి రాకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే తన ఆవు మృత్యువాత పడిందని వాపోయాడు.వెంటనే సంబంధిత అధికారులు విచారణ జరిపించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చిన్నంపల్లిలో గొర్రె..

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని చిన్నంపల్లి గ్రామానికి చెందిన సి వెంకటేష్‌కు చెందిన గొర్రె గురువారం రాత్రి మృతి చెందింది. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ తమ గొర్రె సూటిది కావడంతో వైద్యం కోసం 1962 టోల్ ఫ్రీ నెంబర్‌కు అనేకసార్లు ఫోన్ చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని, డ్రైవర్ లేదు, వాహనాలు లేవు, వైద్యులు లేరంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని వాపోయాడు. స్థానికంగా వైద్యం అందకపోవడంతో ప్రసవ వేదనతో గొర్రె మృతి చెందింది.

భారీ స్కోరు దిశగా అనంత జట్టు

ఉత్సాహంగా అండర్–14 క్రికెట్ పోటీలు


తలపడుతున్న కృష్ణ, శ్రీకాకుళం జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–14 మల్టీడేస్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన మ్యాచ్‌లో కేఎస్ఆర్ఎం మైదానంలో అనంతపురం, విజయనగరం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంత జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి అనంతపురం జట్టు 90 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 377 పరుగులు చేసింది. జట్టులోని టి. కిరణ్‌కుమార్ 109 పరుగులు, ప్రణధీర్ 79 పరుగులు, రోహిత్ రాయల్ 57 పరుగులు చేశాడు. విజయనగరం బౌలర్లు గౌతమ్ 2, విఘ్నేష్ 2 వికెట్లు తీశారు.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో గుంటూరు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 49 ఓవర్లలో 164 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సాయియశ్వంత్ 39, కిన్ను కుశాల్ 37 పరుగులు చేశారు. గుంటూరు బౌలర్లు గోపీచంద్ 4, షాన్ 3, అబ్దుల్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు 39 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 137 పరుగులు చేసింది. జట్టులోని కౌషిక్ 75 పరుగులు, అభినవ్ డేవిడ్ 33 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్ సుశాంత్ 1 వికెట్ తీశారు. దీంతో తొలిరోజు మ్యాచ్ ముగిసింది.


కిరణ్‌కుమార్, అనంతపురం (109 పరుగులు)


ప్రణధీర్, అనంతపురం (79 పరుగులు)


కౌషిక్, గుంటూరు (75 పరుగులు)

వైఎస్ రాజారెడ్డి స్టేడియంలో..

వైఎస్ఆర్ఆర్–ఏసీఏ క్రికెట్ మైదానంలో కృష్ణ, శ్రీకాకుళం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కృష్ణా జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 60.1 ఓవర్లలో 115 పరుగుల వద్ద కృష్ణా జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని రిత్విక్ 29, హర్ష 25 పరుగులు చేశారు. శ్రీకాకుళం బౌలర్లు సాత్విక్ 3, యోజిత్ 2, ఆదిత్య 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు 34 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసింది. జట్టులోని జోగేంద్ర 33, కిరణ్ 30 పరుగులు చేశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

సచివాలయ ఉద్యోగిపై దాడి

రూ.16 వేలు పింఛన్ సొమ్ము దోచుకున్న వైనం


గాయపడిన దేవేంద్రకుమార్

మదనపల్లె : గ్రామ సచివాలయ ఉద్యోగిపై దాడి చేసి పింఛన్ సొమ్ము దోచుకెళ్లిన సంఘటన శుక్రవారం గుర్రంకొండ మండలంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు... శెట్టివారిపల్లె పంచాయతీ బోడిగుట్ట గ్రామానికి చెందిన గుర్రప్ప కుమారుడు ఎం.దేవేంద్రకుమార్ (35) సంగసముద్రం గ్రామ సచివాలయ వెటర్నటీ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి మనోహర్ ఆదేశాలతో 38 మంది లబ్ధిదారులకు ఫించన్ సొమ్ము రూ.1.66 లక్షలు నగదు తీసుకుని తెల్లవారుజామున సంగసముద్రానికి వెళ్లాడు. 34 మందికి ఫించన్ సొమ్ము పంపిణీ పూర్తి చేశాడు. మరో నలుగురు మధ్యాహ్న సమయానికి వస్తారని సమాచారం అందించారు. ఈలోపుగా దేవంద్రకుమార్ ఇంటి వద్ద నుంచి తల్లి పుష్పలత అనారోగ్యంగా ఉందని వెంటనే మందులు తెచ్చి ఇవ్వమని కోరడంతో ద్విచక్రవాహనంలో బోడిగుట్టకు వచ్చాడు. మందులు అందజేసి తిరిగి సంగసముద్రానికి వెళుతుండగా గ్రామ సమీపంలో రోడ్డుకు అడ్డంగా ఎద్దుల బండిని కొందరు వ్యక్తులు అడ్డుగా ఉంచారు. ద్విచక్రవాహనాన్ని ఆపి అటు ఇటు చూసేలోగా అదే గ్రామానికి చెందిన కె.వెంకటేష్(25), అతని తండ్రి రమణ (50)లు దేవేంద్రకుమార్‌ను అడ్డగించి అతని దుస్తులు చిరిగేలా ఎద్దులబండికి ఉన్న కర్రలతో దాడి చేశారు. అతని వద్ద బ్యాగులో ఉన్న పింఛన్ సొమ్ము రూ.16 వేలు దోచుకుని అక్కడి నుంచి పారిపోయారు. దాడిని అడ్డుకున్న దేవేంద్రకుమార్ ముఖం, ఛాతీపై గాయలయ్యాయి. స్థానికులు గుర్రంకొండ ప్రభుత్వ ఆస్పత్రికి బాధితుడిని తరలించగా అక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి పంపించారు. జరిగిన దాడి ఘటనపై గుర్రంకొండ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

అమరవీరుల సంస్మరణార్థం కొవ్వొత్తుల ర్యాలీ


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బెటాలియన్ పోలీసులు

సిద్దవటం : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు 2024 కార్యక్రమంలో భాగంగా ఏపీఎస్పీ 11వ బెటాలియన్ పోలీసులు గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించినట్లు బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంటు నాగేశ్వరప్ప తెలిపారు. ఆయన మాట్లాడుతూ బెటాలియన్ పోలీసు అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలతో కలసి భాకరాపేట మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. అలాగే గురువారం ఉదయం సిద్దవటం మండలం భాకరాపేటలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నుంచి బెటాలియన్ వరకు రన్ ఫర్ యూనిటీ జాతీయ సమైక్యతా పరుగు పందెంను ఇన్‌చార్జి కమాండెంటు నాగేశ్వరప్ప జేండా ఊపి ప్రారంభించారు. అనంతరం బెటాలియన్‌లో సర్దార్ వల్లబాయ్ పటేల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అందరితో జాతీయ సమైక్యతా ప్రతిజ్ఞ చేయించామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంటు కమాండెంటు కె. వెంకటరెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


బీరువా పగులగొట్టిన దృశ్యం

బి.కొత్తకోట : తాళంవేసిన ఇంటిలో దొంగలు పడి దొరికినంత దోచుకున్న ఘటన గురువారం రాత్రి బి.కొత్తకోట శెట్టిపల్లె రోడ్డులో జరిగింది. వివరాలిలా.. స్థానిక శెట్టిపల్లెకు చెందిన షేక్ షకీల తన పిల్లలతో కలిసి గురువారం రాత్రి బంధువుల ఇంటికి వెళ్లి అక్కడే ఉండిపోయింది. ఇంటికి తాళం వేసి ఉండటంతో దొంగలు గేటు తాళాలు, తలుపు తాళాన్ని ఇనుప రాడ్‌తో పగులగొట్టి లోపలికి వెళ్లారు. బీరువాను, అందులోని అరలను పగులగొట్టి దుస్తులు, వస్తువులు చిందరవందర చేశారు. బంగారు, నగల కోసం వెతికారు. వంటిల్లు కబోర్డ్‌లోని డబ్బాల్లో ఉంచిన బంగారు, వెండిని దోచుకున్నారు. నగదు సహా రూ.2.06 లక్షల విలువైన వెండి, బంగారు దోచుకుపోయారు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చిన షకీల చోరీ జరిగిన విషయాన్ని గర్తించింది. సీఐ రాజారెడ్డి, ఏఎస్ఐ బొజ్జినాయక్, కానిస్టేబుల్ లక్ష్మినారాయణ చోరీకి పాల్పడింది పాత నేరస్తులా లేక కొత్తవారా అన్నదానిపై పరిశీలిస్తున్నారు. వేలిముద్రల ఆధారాల కోసం క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేబుల్ వైర్ చోరీ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూర్లపల్లి ప్రభుత్వ బోరు మోటారుకు అమర్చిన కేబుల్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారని సర్పంచ్ సుబ్బిరెడ్డి శుక్రవారం తెలిపారు. బోరు నుంచి జగనన్న కాలనీలో కాపురం ఉంటున్న ప్రజలకు, పక్కనే ఉన్న జెడ్పీ హైస్కూల్‌కు తాగునీరు సరఫరా చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

కోడిపందెం స్థావరంపై పోలీసుల దాడి

– 12 మంది అరెస్టు

కలికిరి : కోడి పందెం స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. వివరాలిలా..మండలంలోని చీకటిపల్లి గ్రామం రంగనాథపురం సమీపం అటవీ ప్రాంతంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రాయచోటి నుంచి ప్రత్యేక పోలీసు బృందం దాడులు నిర్వహించింది. దాడులలో కోడిపందెం ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి తొమ్మిది పందెంకోళ్ళు, 25 ద్విచక్రవాహనాలతో పాటు రూ.19,990 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వాహనాలు, నిందితులను కలికిరి పోలీసులకు అప్పగించడంతో సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు. పోలీసుల రాకను గమనించిన మరికొంత మంది జూదరులు పరారైనట్లు తెలిసింది.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మదనపల్లె పట్టణం ఈశ్వరమ్మకాలనీకి చెందిన మునీశ్వర్ రావు(60) కుటుంబ సమస్యలతో శుక్రవారం ఇంటివద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ములకలచెరువు మండలం బురకాయలకోటకు చెందిన నరసింహులు కుమారుడు బాలు(30) తంబళ్లపల్లె మండలం పరసతోపుకు చెందిన మాధురిని వివాహం చేసుకున్నాడు. అయితే ఆమె కొంతకాలంగా కాపురానికి రాకపోవడంతో శుక్రవారం బాలు అత్తారింటికి వెళ్లాడు. భార్యను కాపురానికి రావాల్సిందిగా కోరాడు. ఆమె నిరాకరించడంతో అక్కడే చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు బాధితుడిని తంబళ్లపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

ఆపరేషన్ వికటించి మహిళ మృతి !


లక్ష్మీదేవి (ఫైల్)

పీలేరు రూరల్ : ఆపరేషన్ వికటించి మహిళ మృతి చెందిన సంఘటన పీలేరు పట్టణం ఎస్‌కేఆర్ హాస్పిటల్‌లో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. కేవీపల్లె మండలం గోరంట్లపల్లె పంచాయతీ కురవపల్లెకు చెందిన చింతపర్తి వెంకటరమణ భార్య లక్ష్మీదేవి (55) కడుపునొప్పితో బుధవారం ఎస్‌కేఆర్ హాస్పిటల్‌కు వెళ్లింది. పరిశీలించిన వైద్యులు ఆపరేషన్ నిర్వహించారు. అయితే పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించారు. అక్కడ ఓ ప్రైవేట్ హాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. దీంతో మృతురాలి బంధువులు గురువారం ఎస్‌కేఆర్ హాస్పిటల్‌కు మృతదేహంతో చేరుకుని ఆందోళనకు దిగారు. ఈ విషయంపై హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎస్‌కే వసీంను వివరణ కోరగా వైద్యం కోసం తమ ఆస్పత్రికి వచ్చిన లక్ష్మీదేవి పరిస్థితి కండీషన్ చాలా సీరియస్ ఉండడంతో ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతోనే ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఐవో ఉషశ్రీ, డెమో దేవశిరోమణి, వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి, తహసీల్దార్ భీమేశ్వర్‌రావు శుక్రవారం ఎస్‌కేఆర్ హాస్పిటల్‌ను సందర్శించి వివరాలు సేకరించారు. నివేదిక ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

మరొక విద్యార్థికి గాయాలు



మృతి చెందిన వెంటకలీలా మనోహర్ (ఇన్‌సెట్) మృతుడి ఫైల్‌ఫొటో

సంబేపల్లె : మండలంలోని చిత్తూరు–కర్నూలు జాతీయరహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దొడ్డా వెంకటలీలా మనోహర్ (20)మృతి చెందగా, మరో విద్యార్థి సాయి కళ్యాణ్ గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ..రాయచోటి కొత్తపేటకు చెందిన వెంకటలీలా మనోహన్, సాయికళ్యాణ్‌లు తిరుపతిలోని మోహన్‌బాబు కాలేజీలో బీటెక్ చదువుతున్నారు. బుధవారం రాత్రి ద్విచక్రవాహనంలో రాయచోటి వస్తుండగా మార్గమధ్యంలోని గుట్టపల్లె సమీపంలో రాగానే నీళ్లట్యాంకర్ ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. గాయపడిన వారిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ వెంకటలీలా మనోహర్ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సంబేపల్లె పోలీసులు తెలిపారు.

మద్యం దుకాణంపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి


దుకాణంలో ధ్వంసమైన మద్యం బాటిళ్లు, సామగ్రి

ములకలచెరువు : స్థానిక మండల కేంద్రంలోని ఒక మద్యం దుకాణంపై గుర్తు తెలియని యువకులు గురువారం సాయంత్రం దాడి చేశారు. పోలీసులు, మద్యం దుకాణం సేల్స్‌మన్ జనార్దన్ కథనం మేరకు... మండలంలోని తంబళ్లపల్లె రోడ్డులోని ఆర్ఆర్ మద్యం దుకాణం వద్దకు సుమారుగా 25 మంది గుర్తు తెలియని యువకులు మాస్కులు ధరించి మద్యం కొనేందుకు వచ్చారు. దుకాణంలో లేని మద్యం బ్రాండ్లు అడగడంతో షేల్స్‌మన్ లేదని చెప్పారు. అడిగే ప్రతి బ్రాండు పెట్టాలి... లేకుంటే షాపు మూసివేయండి అంటూ ఘర్షణకు దిగినట్లు చెప్పారు. మద్యం మత్తులో ఉన్న యువకులు అంతటితో ఆగకుండా కర్రలు, రాడ్లు, రాళ్లతో లోపలికి జొరబడి మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. అడ్డొచ్చిన సిబ్బందిపై దాడికి దిగారు. అనంతరం దుకాణం సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే పలువురిని అదుపులోకి తీసుకున్నారు. సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గాయత్రి పేర్కొన్నారు.

దుకాణానికి నిప్పు


కురబలకోట ఎస్సీ కాలనీలో కాలిపోయిన దుకాణం

కురబలకోట : మండలంలోని వేర్వేరు గ్రామాల్లో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఓ దుకాణానికి నిప్పు పెట్టడంతో పాటు ఆటోను ధ్వంసం చేశారు. పోలీసుల కథనం మేరకు..కురబలకోట ఎస్సీ కాలనీకి చెందిన చింతాకు రెడ్డెప్ప స్థానికంగా బంకు పెట్టుకుని చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వారు నిప్పు పెట్టారు. స్థానికులు కనుగొని మంటలను ఆర్పడానికి యత్నించినా అప్పటికే దుకాణం సరుకులతో సహా మొత్తం కాలి బూడిదయ్యింది. రూ.70 వేల దాకా నష్టం వాటిల్లినట్లు భావిస్తున్నారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆటో ధ్వంసం :

తెట్టు ఎస్సీ కాలనీకి చెందిన నక్క గంగప్ప ఆటోతో జీవనం సాగించేవాడు. ఆటో ఇంటి వద్ద ఉండగా గురువారం అర్ధరాత్రి ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

ఐటీఐ అభ్యర్థులకు ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఐటీఐలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి అప్రెంటీస్‌షిప్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్ 40, మోటారు మెకానిక్ 9, ఎలక్ట్రిషియన్ 5, వెల్డర్ 1, పెయింటర్ 1, మెషనిస్ట్ 5, ఫిట్టర్ 3, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ 1 కలిపి మొత్తం 65 ఖాళీలు ఉన్నాయన్నారు. అలాగే అన్నమయ్య జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్ 36, మోటారు మెకానిక్ 5, ఎలక్ట్రిషియన్ 4, వెల్డర్ 1, పెయింటర్ 1, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ 1 కలిపి మొత్తం 48 ఖాళీలు ఉన్నాయన్నారు. అభ్యర్థులు ఈనెల 5 నుంచి 19వ తేదీలోగా ఆన్‌లైన్‌లో డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.అప్రెంటిస్‌షిప్ ఇండియా.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జిరాక్స్ కాపీల సెట్‌తో వెరిఫికేషన్ కోసం కర్నూలులోని జోనల్ సిబ్బంది ట్రైనింగ్ కళాశాలలో పత్రికా ముఖంగా తెలియజేసే తేదీలను బట్టి హాజరు కావాల్సి ఉంటుందన్నారు. వెరిఫికేషన్‌కు ఫీజు కింద రూ. 118 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి


రాయచోటిలో యూనిటీ రన్‌లో పోలీసు అధికారులు

రాయచోటి : జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఉక్కు మనిషి సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పటేల్ జయంతిని జాతీయ సమైక్యతా దినంగా పరిగణించి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో యూనిటీ రన్‌ను నిర్వహించారు. వల్లబాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం యూనిటీ రన్‌ను ప్రారంభించారు. ఈ పరుగులో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది మానవహారంగా ఏర్పడి దేశ సమైక్యత, భద్రత, అంతర్గత రక్షణను కాంక్షిస్తూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ బి చిన్నికృష్ణ, ఆర్ఐ (అడ్మిన్) వీజే రామకృష్ణ, పోలీసు మోటారు వాహనాల రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎం పెద్దయ్య, లక్కిరెడ్డిపల్లి సీఐ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపులకు అనుమతి


ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

రాజంపేట రూరల్ : పట్టణంలో పలు చోట్ల నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపుల ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ ఎలా అనుమతులు ఇచ్చిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ ప్రశ్నించారు. స్థానిక పాత బస్టాండు కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ బడి, గుడి, చర్చి, మసీదులకు 500 మీటర్ల దూరంలో మద్యం షాపులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆ నిబంధనలకు రాజంపేటలో తూట్లు పొడిచి ఇష్టానుసారంగా మద్యం షాపులు ఏర్పాటు చేశారని మండిపడ్డారు. అలాగే నిత్యం రద్దీ ఉన్న ప్రదేశాలు, ప్రయాణికులకు అనువైన ప్రదేశాలలో మద్యం షాపులు ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.

జోరుగా ఇసుక అక్రమ తవ్వకాలు


పెన్నాలో ఇసుక తవ్వకాల్లో దెబ్బతిన్న పైప్‌లైన్

సిద్దవటం : వ్యవసాయ బోర్లు ఉన్నా..పైప్ లైన్ ఉన్నా ఇవేమి పట్టించుకోం..ఇసుక తోడుకోవడమే మా లక్ష్యం..అంతా మా ఇష్టం అన్న రీతిలో కొందరు జ్యోతిలో ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నట్లు జ్యోతి గ్రామ రైతులు వాపోతున్నారు. గత కొన్ని రోజులుగా పెన్నానదిలో నీరు ప్రవహిస్తున్న విషయం తెలిసిందే. పెన్నా పరివాహక ప్రాంతాలలో రైతులు నదిలో బోర్లను వేసుకుని పైప్‌లైన్ ద్వారా తమ పొలాలకు నీటిని సమకూర్చుకుంటారు. పెన్నాలో నీరు ఉండటంతో పొలాల గట్టుకు ఆనుకుని ఉన్న ఇసుక తెన్నెలను తరలిస్తున్న కారణంగా పైప్‌లైన్ దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్రగాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె అమ్మ చెరువుమిట్టకు చెందిన లలితమ్మ(55) అల్లుడు యశ్వంత్(30)తో కలిసి గురువారం ఆటోలో వాల్మీకిపురానికి వెళుతుండగా, పూలవాండ్లపల్లె సమీపంలోని మలుపు వద్ద ఆటోను లారీ ఢీకొనడంతో ఆటో బోల్తాపడి ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. బి.కొత్తకోట మండలం జంగాలపల్లెకు చెందిన గోపాల్ కుమారుడు జి.శేఖర్(45) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా చేనేతనగర్ వద్ద కారు ఢీకొంది. ప్రమాదంలో శేఖర్ గాయపడ్డాడు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య


మృతిచెందిన తోట చంద్ర

ములకలచెరువు : మండలంలో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా..మండలంలోని గూడుపల్లె పంచాయతీ కనుగొంవారిపల్లెకు చెందిన తోటచంద్ర (48)కు తోట భవానితో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. గత కొన్నేళ్లుగా చంద్ర మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో అవసరాల కోసం డబ్బు ఇవ్వకుండా నిత్యం మద్యం తాగేవాడు. దీంతో భార్య, పిల్లలు చంద్రాకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో అతడు గురువారం సాయంత్రం పురుగు మందు మద్యంలో కలుపుకొని తాగి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని మృతి చెందాడు. చుట్టపక్కల వారు గమనించి భార్యకు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గాయత్రి తెలిపారు.

టపాసులు కాల్చవద్దనందుకు దౌర్జన్యం

నందలూరు : కడప–రేణిగుంట జాతీయ రహదారి నందలూరు బస్టాండ్ సర్కిల్‌లో శ్రీకృష్ణ స్వీట్స్‌కు సంబంధించి తమిళ వాసులు మద్యం సేవించి వీరంగం సృష్టించారు. గురువారం రాత్రి జరిగిన సంఘటనలో హోటల్ జయమాని రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీకృష్ణ స్వీట్స్ నిర్వహకులు బాణసంచా కాల్చుతుండగా తమ షాపులో నిప్పు రవ్వలు పడుతున్నాయని అభ్యంతరం వ్యక్తం చేసిన హోటల్ యజమాని రమేష్‌పై దాడి చేసి గాయపరిచారు. దాడిలో హోటల్ యజమానికి తల పగలగా, అక్కడ పనిచేస్తున్న మరొ వ్యక్తి ముక్కుపై రక్త గాయాలయ్యాయి.